నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 27 డిసెంబర్ 2024 | VIKARABAD

# నగరవాసుల చూపు ఈవీ వైపు

సిటీబ్యూరో: నగరంలో ఈవీ వాహనాల వినియోగం పెరుగుతున్నది. ఈ వాహనాల రోడ్డు ట్యాక్సీతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజునూ రవాణా శాఖ పూర్తిగా మినహాయించిన విషయం తెలిసిందే. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నట్టు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండటంతో నగరవాసుల చూపు ఈవీ వాహనాలపైకి మళ్లింది. మరోవైపు వాహన కాలుష్యం కూడా పెరుగుతుండడంతో అధికారులు ఈవీల కొనుగోళ్లకు అవగాహన కల్పిస్తున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు 1.70 లక్షల ఈవీ వాహనాలు కొనుగోలు అయినట్టు అధికారులు వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే 45 శాతం కొనుగోళ్లు పెరిగాయని చెప్పారు. కాగా, అత్యధికంగా ఈవీల్లో ద్విచక్రవాహనాలు, కార్లు కొనుగోళ్లవుతున్నాయని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో అన్ని రకాల వాహనాలు సుమారు 80లక్షల వరకు ఉన్నాయి. దీంతో పాటు హైదరాబాద్‌లో కొత్త ఆటోలపై నిషేధం ఉన్న దృష్ట్యా అందరూ ఈవీ ఆటోలపై మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు పాత ఆటోలను స్క్రాప్ చేసి వాటి స్థానంలో కొత్త ఈవీ ఆటోలను కొనుగోలు చేస్తున్నారు. కాగా, త్వరలో కొత్త ఆటోలకు సైతం అధికారులు పర్మిట్లు ఇవ్వనున్నట్టు సమాచారం.



తాండూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

# గ్రామీణ ప్రాంతాల్లోనూ పెరుగుతున్న సైబర్ క్రైమ్

- ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్, డిసెంబర్ 26 : గ్రామీణ ప్రాంతాల్లోనూ సైబర్ క్రైమ్ పెరుగుతున్నదని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన తాండూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా లోన్ యాప్స్, జాబ్ ఫ్రాడ్ తదితర నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. పోలీసు కళాబృందాలు వీటిపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. వికారాబాద్ జిల్లాలో రూ. 4.50 కోట్ల సైబర్ నేరాలు జరుగగా.. అందులో తాండూరు సర్కిల్ పరిధిలోనే రూ.1.16 కోట్ల వరకు ఉన్నట్లు వివరించారు. తాండూరు సర్కిల్‌లో 2022 నుంచి 2024 వరకు నేరాల సంఖ్య తగ్గిందన్నారు. 2022లో గ్రీవెన్స్ కేసులు 21 నమోదు కాగా, 2023లో 18, 2024 లో 22 కేసులు నమోదైనట్లు వివరించారు. అదేవిధంగా హత్యలు 20 22లో 10, 2023లో 4, 2024లో 3, అత్యాచారాలు 2022లో 16, 2023లో 10, 2024లో 10 జరిగాయన్నారు. సర్కిల్ పరిధిలో మొత్తం కేసులు 2022లో 712 నమోదు కాగా, 2023లో 723, 2024లో 795 నమోదైనట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టర్లపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొంతమంది ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని వారిపై కఠినంగా ఉండాలన్నారు. అంతకుముందు ఆయన ఠాణాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆయనతోపాటు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్ ఉన్నారు.

# ఈ-చలాన్లపై ఎలాంటి డిస్కౌంట్స్ లేవు

**తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే చట్టరీత్యా చర్యలు**

**నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్**

సిటీబ్యూరో, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఈ-చలాన్లపై ఎలాంటి డిస్కౌంట్లు లేవని నగర అదనపు సీపీ(ట్రాఫిక్) విశ్వప్రసాద్ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఈ-చలాన్లపై డిస్కౌంట్ ఇస్తున్నట్లు సోషల్ మీడియాతో పాటు పలు ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అదనపు సీపీ వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్లపై తెలంగాణ పోలీసు శాఖ ఎలాంటి డిస్కౌంట్లు ప్రకటించలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో వచ్చే సమాచారం సరైనదో కాదో నిర్ధారణ చేసుకోకుండా దానిని వాట్సాప్ గ్రూపుల్లో, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో సర్క్యులేట్ చేయడం నేరమని, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమాచారాన్ని తెలుసుకోవాలన్నా లేక నిజ నిర్ధారణ చేసుకోవాలన్నా పోలీసు శాఖ అధికారిక వెబ్‌సైట్ https://echallan.tspolice.gov.in/publicview/ను చూడాలని లేదా 040-27852772, 27852721 నంబర్లను సంప్రదించాలని సూచించారు.





రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు(ఫైల్)

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలు రోజురోజుకూ ఊపందుకుంటున్నాయి. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గత 20 రోజులుగా కొనసాగిస్తున్న ఆందోళనకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తమ మద్దతు తెలుపుతున్నాయి. దీంతో పలు సేవలకు అంతరాయం కలుగుతున్నది. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు తెగేసి చెబుతున్నారు.

*- రంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ)*

# విద్యాశాఖలో.. సేవలకు బ్రేక్..

**20 రోజులుగా కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల ఆందోళన**

**నిలిచిపోయిన ఆన్‌లైన్ సేవలు**

**మధ్యాహ్న భోజన బిల్లులు పడక నిర్వాహకుల అవస్థలు**

**ఇబ్బందుల్లో కేజీబీవీ, భవిత కేంద్రాలు**

### ఉద్యోగుల సమ్మెతో నిలిచిన పలు సేవలు..

సమగ్ర శిక్షా అభియాన్‌లో 739 మంది ఉద్యోగులు తమ విధులు నిర్వహిస్తున్నారు. వీరి సమ్మెతో విద్యాశాఖలో పలు రకాల సేవలకు బ్రేక్ పడింది. పీఎం పోషణ్, ట్రెజరరీ, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎంఈవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీలుగా పని చేసే ఉద్యోగులు సమ్మె చేయడంతోపాటు మధ్యాహ్న భోజన పథకంలో వంట చేసే కూలీల బిల్లులు అమాంతం నిలిచిపోవడంతో వారు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీంతో మండలాల్లో పని చేస్తున్న వంట కార్మికుల అకౌంట్లో డబ్బులు పడక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కేజీబీవీ, భవిత కేంద్రాల్లో బోధన లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఉద్యోగుల డిమాండ్‌లు ఇవే..

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలి, అప్పటి వరకు మినిమమ్ టైమ్ స్కేల్ అవకాశాన్ని కల్పించాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు అందజేయాలి.
- ప్రభుత్వ విద్యా శాఖ నియామకాల్లో ఉద్యోగులకు వెయిటేజీ కల్పించాలి.
- పీటీఐలకు నెలకు రూ.12 వేల వేతనం ఇవ్వాలి.

### రెగ్యులరైజ్ చేయాలి..



సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. ఇబ్రహీంపట్నం మానవ వనరుల కార్యాలయంలో గత 18 ఏండ్లుగా డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నా. నేటికీ పనికి తగిన వేతనం లేదు. విద్యాశాఖలో వెట్టి చాకిరి చేస్తున్నా.. ప్రభుత్వం తమ పనిని గుర్తించడం లేదు. ఇప్పటికైనా సర్కారు స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. అప్పటి వరకు ఆందోళనను కొనసాగుతాయి.

– జే.సంపత్, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

# ఉద్యోగ భద్రత కల్పించాలని వంటావార్పు

- కొనసాగుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల దీక్షలు
- గురువారానికి 21వ రోజుకు చేరిన నిరసనలు

వికారాబాద్ : తమను క్రమబద్ధీకరించి, సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు ఆగవని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ స్పష్టం చేశారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్యోగులు చేపట్టిన దీక్షలు గురువారానికి 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు వంటావార్పు నిర్వహించారు. సమ్మెలో వికారాబాద్ జిల్లాలో ఉన్న 620 మంది సమగ్రశిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు. ఇందులో ఎంఆర్సీ, సీఆర్సీ, పాఠశాల, కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్ విభాగాల ఉద్యోగులు పాల్గొని.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని.. పీసీసీ అధ్యక్షుడు హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, తక్షణమే పేస్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్‌లో సమగ్ర శిక్షాకు అనుబంధంగా పనిచేస్తున్న ఉద్యోగులకూ న్యాయం చేయాలన్నారు. దీక్షలో మెసెంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, మహిళా నాయకురాలు ప్రభావతి, డీపీవో శేఖర్, పీటీఐ రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాలల ఎస్‌వోలు స్వరూప, స్రవంతి , సునీత, పల్లవి, దేవి, రాజేశ్వరి, సుమిత్ర, రఘుసింగ్, రఘు, ప్రశాంత్, వెంకట్‌రెడ్డి, దశరథ్, మాధవి, రవి, తిరుమలేశ్, మమత, మోహన్, జ్యోతి, అనిత, రమాదేవి, కృష్ణయ్య , నర్సింహులు, నాగయ్య పాల్గొన్నారు.



వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన వంటావార్పులో భాగంగా భోజనాలు చేస్తున్న ఉద్యోగులు

# కలపను కబళిస్తున్న మాఫియా..

**జిల్లాలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా చెట్ల నరికివేత**

**రాత్రి వేళల్లో హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాలకు తరలింపు**

**కలప మాఫియాతో అధికారుల కుమ్మక్కు**

**జిల్లాలో చెట్లను నరికి పచ్చదనాన్ని నాశనం చేస్తున్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు**

వికారాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి జిల్లాలో లక్షల సంఖ్యలో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తే.. కలప మాఫియా మాత్రం అటవీ ప్రాంతాన్ని నాశనం చేసే పనిలో పడింది. జిల్లాలోని కోట్‌పల్లి, బంట్వారం, మర్పల్లి, పెద్దేముల్, దోమ, కులకచర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి.. హైదరాబాద్‌తో పాటు కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవ డంలేదని పలువురు మండిపడుతున్నారు. కలప మాఫియా ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారని పేర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో యథేచ్ఛగా చెట్లను నరుకుతూ గుట్టు చప్పుడు కాకుండా లారీల్లో వికారాబాద్, నవాబుపేట, శంకర్‌పల్లి సమీపం నుంచి హైవే మీదుగా కాటేదాన్ ప్రాంతంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాలకు కలపను తరలిస్తున్నారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో నిత్యం ఈ దందా యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



# ముసురుకున్నది..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా ముసురు కురుస్తున్నది. దీంతో చలి తీవ్రత పెరుగడంతో కొందరు జనం ఇండ్లకే పరిమితమయ్యారు. పలు పల్లెల్లో రోడ్లు బురదమయంగా మారాయి. చేతికొచ్చిన పత్తి, మిర్చి తదితర పంటలకు నష్టం వాటిల్లుతున్నదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



